నేడు ప్రశాంతి నిలయంలో విజయదశమి వేడుకలు



యజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రశాంతి నిలయంలో విజయదశమి పర్వదిన వేడుకలు శనివారం ఘనంగా జరగనున్నాయి. వేడుకలను పురస్కరించుకుని సాయి కుల్వంత్ మందిరాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం విశ్వశాంతిని కాంక్షిస్తూ పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం పూర్ణాహుతితో ముగియనుంది. పైడిపల్లి సుబ్బావధాని ఆధ్వర్యంలో 27 మంది వేదపండితులు యజ్ఞ క్రతువు నిర్వహించారు. వేడుకలు తిలకించడానికి దేశవిదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలిరావడంతో ప్రశాంతి నిలయం కిటకిటలాడుతోంది.

అలరించిన సంగీత గానకచేరి

సత్యసాయి ప్రపంచ మానవాళికి ఆధ్యాత్మిక బోధనలు, శాంతి, ప్రేమ సందేశాలు అందించి సన్మార్గం వైపు నడిపించారని ప్రముఖ విద్యావేత్త శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సాయికుల్వంత్ మందిరంలో ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. విద్యార్థులు వేద పఠనంతో వేడుకలను ప్రారంభించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత గానకచేరి నిర్వహించారు.

శక్తి స్వరూపిణి.. శత్రు సంహారిణి

లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో పర్యాటక శాఖ నిర్వహించిన దసరా ఉత్సవాల్లో చిన్నారుల నవ చండీ నృత్యరూపకం అలరించింది

–న్యూస్‌టుడే, లేపాక్షి





ఆత్మకూరు మండలం రంగంపేట చెరువుకు జలకళ

కరవు సీమలో.. కృష్ణమ్మ పరవళ్లు

చెరువులకు హంద్రీనీవా జలాలు

ఈనాడు, పుట్టపర్తి: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చెరువులు కృష్ణమ్మ స్పర్శతో పరవశిస్తున్నాయి. రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో ఒట్టిపోయిన బోర్లు ఇప్పుడిప్పుడే జీవం పోసుకుంటున్నాయి. అనంతపురం జిల్లాలో 51, శ్రీసత్యసాయి జిల్లాలో 10 చెరువులను కృష్ణా జలాలతో నింపుతున్నారు. ఇప్పటికే 20 చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. మిగిలిన 41 చెరువులు ఒకటి, రెండు వారాల్లో నిండుతాయని అధికారులు చెబుతున్నారు. గతేడాది నుంచి సకాలంలో వర్షాలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ వస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయిన దుస్థితి. గతేడాది బోర్ల కింద సాగుచేసిన పంటలు సైతం ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో కాలువల ద్వారా చెరువులకు కృష్ణా జలాలు ఇస్తుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

12 వేల ఎకరాలకుపైగా..

హంద్రీనీవా జలాలు ఆగస్టు 6వ తేదీన అనంతపురం జిల్లాకు చేరుకున్నాయి. ఇప్పటివరకు 7 టీఎంసీలు అందాయి. అనంతపురం సరిహద్దు 144వ కిలోమీటరు నుంచి 176వ కిలోమీటరు వరకు గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల్లోని పలు చెరువులకు నీటిని మళ్లిస్తున్నారు. 176 నుంచి 181 కిలోమీటర్ల వరకు వజ్రకరూరులోని 6 చెరువులు, 186 నుంచి 205 కిలోమీటర్ల మధ్యలో ఉరవకొండలోని 9 చెరువులకు నీరు అందిస్తున్నారు. ఫేజ్-1 పరిధిలోని 36ఏ ప్యాకేజీ ద్వారా బెళుగుప్ప మండలంలోని 2 చెరువులను నింపుతున్నారు. ఫేజ్-2లో 224 నుంచి 232 కిలోమీటర్ల వరకు కూడేరు మండలంలోని 6 చెరువులకు నీటిని విడుదల చేశారు. గుంతకల్లు నియోజకవర్గంలో 2,940 ఎకరాలు, ఉరవకొండ నియోజకవర్గంలో 915 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వనున్నారు. 36ఏ ప్యాకేజీ ద్వారా రాయదుర్గం పరిధిలోని కణేకల్లు మండలం కల్లేకుర్తి చెరువుకు ఇస్తున్నారు. ఫేజ్-2లోని బుక్కరాయసముద్రం, అనంత గ్రామీణం, ఆత్మకూరు, రాప్తాడు మండలాల్లోని చెరువులను నింపుతున్నారు. మొత్తంగా 12,039 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా నీరు నింపుతున్న చెరువుల వివరాలు

నియోజకవర్గం	చెరువులు	ఆయకట్టు
రాప్తాడు	28	8,529
గుంతకల్లు	06	2,940
శింగనమల	01	1,355
ఉరవకొండ	23	915
ధర్మవరం	01	323
రాయదుర్గం	01	82

అత్యధికంగా రాప్తాడు పరిధిలో..

రాప్తాడు నియోజకవర్గంలోనే అత్యధికంగా 28 చెరువులు ఉండగా.. వీటిలో ఇప్పటికే కొన్ని వందశాతం నిండాయి. మిగిలిన వాటిలో 70 శాతం నీరు చేరింది. అనంతపురం గ్రామీణం పరిధిలో 3, ఆత్మకూరు 11, రాప్తాడు 5, కనగానపల్లి 5, రామగిరిలో 4 చెరువులను హంద్రీనీవా నీటితో నింపుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని కనగానపల్లి, రామగిరి, ధర్మవరం మండలాల్లో 10 చెరువులను నింపుతూ 2,105 ఎకరాల ఆయకట్టుకు నీరందించనున్నారు.



ధర్మవరం మండలం రేగాటిపల్లి చెరువు..

రాబోయే మూడు రోజుల్లో వర్షాలు

పుట్టపర్తి: రాబోయే మూడు రోజుల్లో జిల్లాలో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసినట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

20 మండలాల్లో వర్షం.. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి 20 మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా రొద్దం 66.2 మి.మీ., అత్యల్పం పుట్టపర్తి 1.8 మి.మీ. వర్షం కురిసింది. అమరాపురం 65.4, రొళ్ల 60.4, గుడిబండ 41.0, హిందూపురం 38.4, అమరాపురం 32.7, చిలమత్తూరు 32.4, సోమందేపల్లి 30.8, లేపాక్షి 24.6, పరిగి 20.4, పెనుకొండ 18.2, మడకశిర 15.2, నల్లమాడ 7.0, రామగిరి 6.8, అగళి 6.6, కనగానపల్లి 5.2, కొత్తచెరువు 5.0, ముదిగుబ్బ 3.8, బత్తలపల్లి 2.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

మద్యం దుకాణాలు 87.. దరఖాస్తులు 1,460

పుట్టపర్తి గ్రామీణంలో అత్యధికం, కనగానపల్లిలో అత్యల్పం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో మద్యం దుకాణాలకు పోటాపోటీగా దరఖాస్తులు వచ్చాయి. లాటరీలో ఒక దుకాణం దక్కినా చాలనే భావనతో రాజకీయ నాయకుల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల వరకూ దరఖాస్తులు దాఖలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 87 మద్యం దుకాణాలకు 1,460 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా పుట్టపర్తి గ్రామీణంలో 40వ దుకాణానికి 43, 41వ దుకాణానికి 42, అత్యల్పంగా కనగానపల్లి 24వ దుకాణానికి 4, రామగిరి 25, సీకే పల్లి 21 దుకాణాలకు 5 దరఖాస్తులు చొప్పున వచ్చాయి. పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో అత్యధికంగా, రాప్తాడు, ధర్మవరం, కదిరి నియోజక వర్గాల్లో తక్కువగా దాఖలు అయ్యాయి. ఈనెల 14వ తేదీ ఉదయం 8గంటలకు సాయి ఆరామంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన లాటరీ ద్వారా మద్యం దుకాణాలను ఎంపిక చేయనున్నారు. టెండర్లలో అదృష్టవంతులెవరో తేలనుంది. 87 దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.29.20 కోట్ల రాబడి రానుంది. 16వ తేదీ నుంచి నూతన దుకాణాల ద్వారా మద్యం విక్రయించనున్నారు.



విజయదశమి శుభాకాంక్షల ప్రత్యేక అనుబంధం నేటి సంచికతో ఉచితంగా అందుకోగలరు

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శుభవార్త

డీఎస్సీకి ఉచిత శిక్షణ

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం శుభవార్తను అందించింది. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం అయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ విడుదలైంది. పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి దారి చూపారు. రెసిడెన్షియల్‌తోపాటు నాన్ రెసిడెన్షియల్ ప్రాతిపదికన శిక్షణ ఇవ్వనున్నారు. టెట్ ఉత్తీర్ణులై ఉంటే వారికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తారు. ఈ టెస్టులో 85 శాతం, టెట్ నందు పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజీ ఉంటుంది. దీని ప్రకారం వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉన్నవారిని ఎంపిక చేస్తారు. స్థానిక సచివాలయంలో 6 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ఉంటుంది. శిక్షణ ఇచ్చేందుకు ఎంప్యానెల్‌మెంటు కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 14 లోగా తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలి. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు లావణ్య వేణి పలు అంశాలను వివరించారని సాంఘిక సంక్షేమ సంచాలకులు ఖుష్బు కొఠారి వెల్లడించారు. **దరఖాస్తు చేయడానికి వెబ్‌సైట్:** jnanabhumi.ap.gov.in, **చివరి తేదీ:** 21.10.2024, **ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్టు:** 27.10.2024, **అర్హులు:** టెట్ ఉత్తీర్ణత.

పండగలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని రద్దీని అధిగమించడానికి గుంతకల్లు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. జాల్నా - తిరుపతి మధ్య రైళ్లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. జాల్నాలో రైలు (07621) ఈనెల 13, 20, 27, నవంబరు 3వ తేదీల్లో బయలుదేరి రాయచూరు, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి మీదుగా తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు(07622) తిరుపతి నుంచి ఈనెల 14, 21, 28, నవంబరు 4వ తేదీల్లో వెళ్తుందన్నారు. రైలు జాల్నాలో సాయంత్రం 7.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6.30కు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతిలో రాత్రి 9.10కి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు జాల్నా చేరుకుంటుంది.

రీ సర్వేతో ముప్పుతిప్పలు!

పరిష్కారం చూపాలని రైతుల వేడుకోలు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: భూ వివాదాలు, విస్తీర్ణం ఇతర వివాదాలకు పరిష్కారం చూపుతామంటూ వైకాపా జగనన్న భూరక్ష కార్యక్రమాన్ని గత వైకాపా ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టింది. రీ సర్వే తరువాత వేలాది మంది రైతులకు పాసుపుస్తకాలు, వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వివరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



● డ్రోన్ ద్వారా రెండు విడతలలో రీ సర్వే పూర్తి చేశారు. సర్వే తరువాత విస్తీర్ణం, సర్వే నంబరు తదితర వివరాల నమోదులో పలువురు అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. డ్రోన్ ద్వారా సర్వే పూర్తి చేసి రైతులకు సర్వే నంబర్ల వారీగా కాకుండా సంశిష్టంగా (ఏకీకృతంగా) ఎల్‌పీఎస్‌లు నమోదు చేశారు. ఒకే సర్వే నంబరు అయి ఉండి, సబ్ డివిజన్ అయిన వారికి వెబ్‌ల్యాండ్ ద్వారా 1బీ వస్తోంది. కాని వాటికి భూమిలో భాగం ఉన్న రైతులందరికీ కలిపి ఒకే ఎల్‌పీఎస్ వస్తున్నాయి. వెబ్‌ల్యాండ్‌లో కూడా మీ భూమి ద్వారా మాత్రమే వారికి 1బీలు వస్తున్నాయి. వీటితో రుణాల నవీకరణకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు పంట రుణం పెంచుకునే అవకాశం ఉన్నప్పటికీ ఒక్కొక్కరికి 1బీ అందే అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి. పాత రుణాన్ని నవీకరించుకోవాలన్నా తిప్పలే. అదే రుణంతో కొనసాగాల్సి వస్తోంది. ఎల్‌పీఎస్‌లతో క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా పోయింది. వాస్తవ విస్తీర్ణం కన్నా ఒక రైతుకు ఎక్కువగా, మరో రైతుకు తక్కువగా భూ విస్తీర్ణం నమోదైన దుస్థితి.

ఏడుగురికి ఒకే ఎల్‌పీఎస్..

'సీకేపల్లి మండలం ప్యాదిండి గ్రామంలో సర్వే నంబరు 415లో 35 ఎకరాల పట్టా భూమి ఉంది. అందులో ఏడుగురు రైతులకు ఒక్కొక్కరికి ఐదెకరాల విస్తీర్ణం ఉంది. గతంలో ఏడుగురికి ఐదెకరాల విస్తీర్ణం ఉండగా రీ సర్వే తరువాత ఒకరికి 15 సెంట్లు ఎక్కువగా మరొకరికి అంతే విస్తీర్ణం తక్కువగా నమోదైంది. ముందు ఉన్న భూమి దస్త్రాలు ఎలా ఉన్నాయో యథావిధిగా ఉంటేనే రీ సర్వేను అంగీకరిస్తామని లేకుంటే సమీక్షించాలని చెప్పాం. అందరికీ ఒకే ఎల్‌పీఎస్ కేటాయించడం వల్ల ఈ పంట నమోదు చేయించుకోలేకపోయాం. క్రయ, విక్రయాలు చేసుకోవాలన్నా కుదరడం లేదు' అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అందరూ వస్తేనే చేస్తామంటున్నారు



నా పేరున మూడెకరాల భూమి ఉంది. నా సర్వే నంబరులోనే మరో ఆరుగురు రైతులకు సంశిష్టంగా (కలిపి) భూమి ఉంది. ఈ పంట నమోదు చేయమని ఆర్‌బీకే అధికారులను సంప్రదిస్తే మీ భూమిలోని రైతులంతా కలిసి వస్తేనే వివరాలు నమోదు చేస్తామని సమాధానమిచ్చారు. మాలో కొంతమందికి ఎక్కువగా ఉన్నట్లు, కొంతమందికి తక్కువగా ఉన్నట్లు వచ్చింది.

\- తలారి నరేంద్ర, ప్యాదిండి

బిందుసేద్య పరికరాలు అందాలంటే గగనమే



ప్రభుత్వం బిందు సేద్యపు పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నా. పది రోజుల్లోనే పరికరాలు అందిస్తామని తెలపడంతో ఇటీవల కురిసిన వర్షానికి ఆరెకరాలలో వేరుసెనగ సాగు చేశా. దరఖాస్తు చేసిన 15 రోజుల తరువాత స్ప్రింక్లర్ల కోసం కంపెనీ అధికారులను సంప్రదించా. భూమికి సంబంధించి 1బీ తీసుకురావాలన్నారు. భూమి మొత్తం ఐదుగురు అన్నదమ్ముల పేరున కలిపి ఉంది. అందరికీ కలిపి ఒకే ఎల్‌పీఎస్ వస్తోంది. నా పేరున విడిగా 1బీ రావడం లేదు. చేసేదేం లేక రూ.50 వేలు వెచ్చించి వ్యాపారస్థుల వద్ద పంట కోసం స్ప్రింక్లర్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

\- మల్లేశ్, నామాల గ్రామం

గుర్తు తెలియని మహిళ ఫొటోతో పాసుపుస్తకం



నా భార్య పేరున 4.80 ఎకరాల భూమి ఉంది. రీ సర్వేకి ముందు ఆమె ఫొటోతోనే ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకం ఉండేది. రీ సర్వే తరువాత ఎవరో గుర్తు తెలియని మహిళ ఫొటోతో పాసు పుస్తకం మంజూరు చేశారు. కవర్ పేజీపై జగన్ ఫొటో ఉంది. పైగా గతంలో ఉన్న భూమి కంటే అర ఎకరం విస్తీర్ణం తగ్గింది.

\- పోతలయ్య, ప్యాదిండి

జీఎస్టీ బకాయి వసూళ్లలో ప్రథమస్థానం

అనంతపురం (అరవిందనగర్) న్యూస్‌టుడే: వాణిజ్య పన్నుల అధికారులు జిల్లాలో ఆరు నెలలుగా జరిపిన ఆడిట్స్, సరుకు రవాణా వాహన తనిఖీలు, పన్ను బకాయి వసూళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 2023-2024 ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు నాటికి పన్ను వసూలు లక్ష్యం రూ.442 కోట్లు. కాగా రూ.376 కోట్లు పన్ను వసూలుతో 10 శాతం వృద్ధి నమోదు సాధ్యపడిందని జీఎస్టీ రాష్ట్ర పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శేషాద్రి తెలిపారు.


శేషాద్రి

● జిల్లావ్యాప్తంగా 57 వేల మంది డీలర్లు ఉన్నారని, సకాలంలో రిటర్నులు ఇవ్వని వారి నుంచి జరిమానా, అపరాధ రుసుం 18 శాతం కట్టాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నా రిటర్నులు దాఖలు చేయని వారిని గుర్తించి వారికి అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. సరుకు అక్రమ రవాణా వాహనాలపై ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేసామని, ఆరు మాసాలుగా జరిపిన ఆకస్మిక తనిఖీల ద్వారా రూ.75 కోట్లు వసూలు చేసినట్లు వివరించారు. నిర్మాణ రంగం, గుత్తేదారుల ద్వారా పన్ను వసూలు రూ.42 కోట్లు ఉన్నట్లు తెలిపారు. సిమెంటు పరిశ్రమల ద్వారా రూ.87 కోట్లు, స్టీలు పరిశ్రమ ద్వారా రూ.3 కోట్లు, మొబైల్ ఫోన్లు రూ.22.4 కోట్లు, టెక్స్‌టైల్స్ రెడీమేడ్ దుస్తులు రూ.67.32 కోట్లు, ఎరువులు, రసాయన మందులు రూ.2.55 కోట్లు వసూలైనట్లు వివరించారు. తప్పుడు రిజిస్ట్రేషన్లతో జీఎస్టీ ఎగవేస్తున్న 100 సంస్థల జాబితా కేంద్ర కార్యాలయం నుంచి అందిందని, అందులో 9 కేసులు నకిలీలుగా గుర్తించినట్లు తెలిపారు.

సాగు, తాగునీటి సమస్యపై సీపీఎం బస్సుయాత్ర

అజాద్‌నగర్ (అనంతపురం): జిల్లాలో సాగు, తాగు నీరు సమస్యలపై ఈ నెల 15 నుంచి 20 వరకు బస్సుయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం ప్రకటన విడుదల చేసింది. తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లను అమర్చాలని, హెచ్చెల్సీ ఆధునికీకరణ హంద్రీనీవా ఆయకట్టు భూములకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేసింది.

చింతలరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలో ప్రసిద్ధి గాంచిన చింతలరాయుడి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ధ్వజారోహన కార్యక్రమాన్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతల వెంకటరమణస్వామి, భూదేవి, శ్రీదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి శేషవాహనంపై కొలువుతీర్చి పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.


శేషవాహనంపై చింతలరాయుడు

పురుషుల ఫుట్‌బాల్ ఛాంపియన్ సత్యసాయి జిల్లా జట్టు


విజేత జట్టుకు కప్ అందిస్తున్న నిర్వాహకులు

హిందూపురం, న్యూస్‌టుడే: గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో కర్నూలు జట్టుతో తలపడి విజేతగా నిలిచి కప్ కైవశం చేసుకొందని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ తెలిపారు. జట్టు కోచ్ గా బీకే మహమ్మద్ సలీమ్, మేనేజర్‌గా కె.ఇర్షాద్ అలీ వ్యవహరించినట్లు ఆయన పేర్కొన్నారు. జట్టు సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

12 మందికి గాయాలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : గార్లదిన్నె మండలంలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవరు అప్రమత్తతతో భారీ ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 52 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈక్రమంలో హైదరాబాదు నుంచి బెంగళూరుకు బెల్లంపాకు లోడుతో వెళ్తున్న ట్యాంకరును డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో తిమ్మంపేట సమీపంలో బస్సు ముందు భాగాన్ని ఢీకొంది. ఈఘటనతో బస్సు బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న హైదరాబాదుకు చెందిన గోపికృష్ణ, అక్షిత్‌బాబు, భూపతి, పూర్ణిమ, శ్యామల, అన్నెగౌడ్, వైఆర్‌రెడ్డి, మునిస్వామి, లాలుబాషా, శ్రీకాకుళం చెందిన విశ్వనాథరావు, కర్నూలు జిల్లా లక్ష్మీపురానికి చెందిన గురుమూర్తి, బస్సు డ్రైవరు రాము, ట్యాంకరు డ్రైవరు వసంతరావు గాయపడ్డారు. వీరిని అత్యవసర చికిత్స కోసం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొంత మందిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ప్రయాణికులను పోలీసులు హైదరాబాదుకు చెందిన మరో బస్సులో సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. ఘటనా స్థలాన్ని శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్సై గౌస్‌బాషా పరిశీలించి ట్యాంకరు డ్రైవరు వసంతరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

చేనేత కార్మికుడి బలవన్మరణం


రంగా

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు ఉడుముల రంగా(45) అప్పులు తీర్చలేక మగ్గం షెడ్డులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నెల 9న ఊరికి పోతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లారు. అదే రోజు రాత్రి మగ్గం షెడ్డులో లుంగీతో ఉరి వేసుకున్నారు. రెండు రోజులుగా షెడ్డు నుంచి మగ్గం నేసే చప్పుడు వినిపించక పోవడంతో శుక్రవారం స్థానికులు వెళ్లి చూశారు. అతడు ఉరి తాడుకు వేలాడుతుండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు, టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య రేవతి, కుమారుడు, కుమార్తె అక్కడికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. చేనేత మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునే రంగా వడ్డీ వ్యాపారుల వద్ద రూ.6లక్షల వరకు అప్పు చేశారు. వాటిని తీర్చేందుకు ఇంటిని అమ్మేశారు. అయినా అప్పు తీరకపోవడంతో రామ్‌నగర్ శివారులో షెడ్డు ఏర్పాటు చేసుకొని మగ్గం నేసేవారు. అప్పులిచ్చిన వారు తరచూ ఇంటి వద్దకు వస్తుండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అధిక వడ్డీలే ప్రాణం తీశాయని తోటి చేనేత కార్మికులు పేర్కొంటున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీశ్, భాజపా నాయకులు రంగా కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. తెదేపా పట్టణాధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. చేనేతజౌళిశాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి శుక్రవారం రామ్‌నగర్‌లోని రంగా నివాసానికి వెళ్లి విచారణ చేపట్టారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఏడీకి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారికి రూ.3వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేందుకు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పది తులాల బంగారం, నగదు అపహరణ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులోని హనుమేష్ నగర్‌లో దుండగులు ఇంటి తాళం పగలగొట్టి రూ.1.20 లక్షల నగదు, పది తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారని బాధితుడు కాకర్ల రంగనాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం చోరీ విషయం వెలుగు చూసింది. రంగనాయకులు హనుమేష్ నగర్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలికల వసతి గృహం ఎదురుగా ఉన్న ఇంటిపై అద్దెకు ఉన్నారు. ఇతని ఆరోగ్యం బాగ లేకపోవడంతో వైద్యం కోసం మంగళవారం భార్యతో కలిసి అనంతపురం వెళ్లారు. వైద్యుడు లేకపోవడంతో రెండు రోజుల పాటు బంధువుల ఇంట్లో ఉన్నారు. ఈక్రమంలో ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో శుక్రవారం ఉదయం ఇంటి యజమాని బాధితులకు, పోలీసులుకు సమాచారం ఇచ్చారు. ఉదయం 11గంటలకు బాధితులు ఇంటికి చేరుకున్నారు. దుండగులు ఇంటి ఐరన్ గ్రిల్ తాళం తీసి బీరవాను పగలగొట్టి రూ.1.20 లక్ష నగదు, పది తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారని బాధితులు వాపోయారు. పోలీసులు డ్యాగ్‌స్కాడ్‌ను, క్లూస్‌టీమ్‌ను రప్పించారు. క్లూస్‌టీమ్ బృందం లోపల వేలిముద్రలను సేకరించారు. ఒకటో పట్టణ సీఐ మనోహర్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. డీఎస్పీ కార్యాలయం దగ్గరలోనే చోరీ జరగడం గమనార్హం.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్, సీఐ మనోహర్

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ఘనంగా చండీహోమం


హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తదితరులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి పూజల్లో భాగంగా చందకచర్ల గంగమ్మదేవి ఆలయంలో శుక్రవారం కలశపూజ, చండీ హోమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచి ఆంజనేయులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, వెంకటాద్రి, కిష్టప్ప, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మదేవికి జ్యోతులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో ఉన్న యల్లమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాదిమంది మహిళలు వివిధ రకాల పుష్పాలతో తయారు చేసిన జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు.


జ్యోతులు మోస్తున్న మహిళలు

ఆచరణలోకి రాని ఇంటింటి చెత్తసేకరణ
ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు

పెనుకొండ, న్యూస్‌టుడే: ఇంటింటికీ ఆటోల్లో వెళ్లి తడి, పొడి చెత్త వేరుగా సేకరించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్తతో సంపద తయారు చేయలన్న లక్ష్యంతో ప్రభుత్వం నగరపంచాయతీకి 6 ఎలక్ట్రిక్ ఆటోలు అందజేసింది. రూ.లక్షలు విలువచేసే ఆటోలను మంజూరు చేసిన ప్రభుత్వం వాటికి చోదకులు, సహాయకులను నియమించకడపోవడంతో నగరపంచాయతీ కార్యాలయం ఆవరణలోనే ఎండుతూ, తడుస్తూ ఉండిపోయాయి. దీనికితోడు పెనుకొంలోని కోతులు ఆటోలపై తిరగడంతో అందులో అమర్చిన సీసీ కెమెరాలు, మైకులు విరిగిపోతున్నాయి. ఆటోలొచ్చి ఏడు నెలలవుతున్నా అధికారులు వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారు.


ఆటోలో చెత్తసేకరణ చేపట్టక ముందే విరిగిపోతున్న సీసీకెమెరాలు, మైకులు

నెరవేరని లక్ష్యం

ఇంటింటికీ చెత్తసేకరణ చేయడం ద్వారా పట్టణం శుభ్రంగా ఉంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం ఆటోలు రాకపోవడంతో పలు వీధుల్లో ఖాళీస్థలాల్లో చెత్త పడేస్తున్నారు. చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడంతో ఆమార్గంలో వెళ్లేందుకు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం పెనుకొండ నగరపంచాయతీ జనాభా 44 వేలు. ప్రతిరోజు దాదాపు 30 టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. కేవలం చెత్తబుట్టల్లో వేసిన చెత్తను మాత్రమే రెండు రోజులకోసారి నగరపంచాయతీ వాహనంలో తీసుకెళుతున్నారు. ఇళ్లలోంచి తెచ్చి ఖాళీ స్థలాల్లో పడేస్తున్న చెత్తను రెండువారాలకోసారి తీసుకెళ్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు.


జీవీసీ కాలనీలోని పేరుకుపోయిన చెత్త

కనీసం రెండు రోజులకోసారైనా..

పట్టణంలో కనీసం రెండు రోజులకోసారైనా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరిస్తే పట్టణం పరిశుభ్రంగా ఉండడంతో పాటు, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ప్రస్తుతం ట్రాక్టర్‌లో చెత్త సేకరణ చేయడం వల్ల చిన్న చిన్న సందుల్లో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగదు. ప్రభుత్వం ఇచ్చిన ఆటోల్లో చెత్తసేకరణ ప్రారంభిస్తే అందరికీ మేలు జరుగుతుంది.
-షేక్షావలి, స్థానికుడు

ఆటోలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం

నేను ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. ఆటోలు ఇక్కడ నిలబడి చాలారోజులైంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఈఆటోలు ఎలక్ట్రిక్‌వి కావడం, వాటిని తెచ్చినప్పటి నుంచి వినియోగించకపోవడం వల్ల మొదట ఆటోల పనితీరు పరిశీలిస్తాం. కండిషన్‌లో ఉంటే సిబ్బందిని నియమించుకుని, పూర్తిస్థాయిలో ఇంటింటికీ చెత్త సేకరణ జరిగే విధంగా చర్యలు చేపడతాం.
-శ్రీనివాసులు, కమిషనర్, నగరపంచాయతీ పెనుకొండ

కనుల పండువగా దసరా ఉత్సవాలు

లేపాక్షి, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన లేపాక్షి, పెనుకొండ, పుట్టపర్తి, తిమ్మమ్మమర్రిమానుతో పాటు హేమావతి, రత్నగిరి కోట, కదిరి, గోరంట్ల ఆలయం తదితర పర్యాటక కేంద్రాలు ఉన్నాయని వీటి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన దసరా ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. హిందూపురానికి చెందిన లక్ష్మీప్రసన్న బృందంచే సంగీత వాయిద్యాల విభావరి, ధర్మవరం నిమ్మలకుంటకు చెందిన షిండే కుళ్లాయప్ప బృందంచే నిర్వహించిన తోలుబొమ్మలాట, ప్రాచీన కళా ప్రదర్శనలు ప్రజలను అలరింపచేశాయి. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖాధికారి జయకుమార్‌బాబు, తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, నాయకులు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షిలో ఆకట్టుకున్న బృంద నృత్యం

అన్నదానానికి విరాళం

లేపాక్షి: లేపాక్షి ఆలయం సమీపంలో వీరభద్ర అన్నప్రసాద సేవా ట్రస్టు నిర్వహిస్తున్న అన్నదానానికి బెంగళూరుకు చెందిన ప్రముఖ న్యాయవాది ఎస్‌కేవీ చలపతి రూ.50వేల చెక్కును శుక్రవారం కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా దాతను కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపికను అందించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: గంగంపల్లికి చెందిన మనోహర్ అనే యువకుడు కుటుంబ సమస్యల నేపథ్యంలో శుక్రవారం విషపూరిత ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్సలు చేసి హిందూపురం పంపించారు.

యువతి అదృశ్యం

రొద్దం: జీవీపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం తన పెద్దమ్మ ఇంటిలో జాకెట్టు కుట్టించుకుని వస్తానని యువతి వెళ్లింది. రెండు రోజులైనా రాకపోవడంతో ఆమె తల్లి శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేంద్ర బాబు తెలిపారు.

ముద్దబంతి కిలో రూ.100

మడకశిర గ్రామీణం: ముద్దబంతి రైతులకు శుక్రవారం వర్షం రాకపోవడంతో ఊరట కలిగింది. ఆయుధ పూజకు ముద్దబంతి మంచి ధర పలికింది. వ్యాపారులు తోటల వద్దకే వచ్చి కిలో రూ.50లకు కొనుగోలు చేసి మార్కెట్‌లలో కిలో రూ.80ల నుంచి రూ.100లకు విక్రయించారు. మంచి ధర రావడంతో పెట్టుబడులు వచ్చాయని రైతులు తెలిపారు.

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు


హిందూపురం: కొల్హాపురమ్మకు పుష్పార్చన


పరిగి: సగ్గు బియ్యం అలంకరణలో కాళికామాత


చంద్రగిరిలో రాజరాజేశ్వరీదేవిగా..


గుడిబండ: తుమ్మలమారెమ్మ


మడకశిర: శాకంబరిగా కన్యకాపరమేశ్వరి


సోమందేపల్లి: మహంకాళిగా అంబాభవాని


కల్లుమర్రిలో వీరక్యాతమ్మ


హిందూపురంలో నవశక్తిగా వాసవీమాత

దసరా పండగను పురస్కరించుకుని తొమ్మిదో రోజు ఆయుధ పూజ నిర్వహించారు. వివిధ ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమందేపల్లిలో శుక్రవారం రాత్రి స్థానిక చౌడేశ్వరీదేవి అమ్మవారిని డీఎస్పీ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతం గా దర్శించుకొన్నారు. -న్యూస్‌టుడే బృందం


మహిషాసురమర్దినిగా కొల్హాపుర మహాలక్ష్మి


గోరంట్ల: చౌడేశ్వరీదేవి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759

సమస్య: అగళి ఎస్సీ కాలనీలో మురుగు నిలిచింది. -కృష్ణప్ప
సమాధానం: కాలువ శుభ్రం చేయిస్తాం. -పద్మ, ఈవోఆర్డీ, అగళి
సమస్య: యూటీపల్లి వెళ్లే రోడ్డులో కంపచెట్లు పెరిగాయి. -పాండురంగప్ప
సమాధానం: కంపచెట్లు తొలగిస్తాం. -పుణీలా, కార్యదర్శి, పి.బ్యాడిగెర
సమస్య పరిష్కారం: మండలంలో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో మేమున్నాం మీకు తోడుగా శీర్షిక ప్రచురించగా బాధ్యులు స్పందించారు. కదిరేపల్లిలో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచి సుజాత స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. - న్యూస్‌టుడే, అగళి

సమస్య: పట్టణంలోని పరకోటకుంటాదేవి వద్ద ఉంది చెత్తకుండి పూర్తిగా నిండిపోయి చెత్త కిందపడింది. దుర్గంధం వెదజల్లుతోంది. -నాగేంద్ర
సమాధానం: సిబ్బందిని పంపి తొలగించేస్తాం. -శ్రీనివాసులు, కమిషనర్, నగరపంచాయతీ పెనుకొండ. -న్యూస్‌టుడే, పెనుకొండ

పిడుగుపాటుకు కాలిన నియంత్రిక

రొద్దం, న్యూస్‌టుడే: రొద్దంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికపై పిడుగుపడటంతో ధ్వంసమైందని స్థానికులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరకు పూర్తిగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో బ్యాంకులో కంప్యూటర్లు పని చేయలేక ఇబ్బందులు పడ్డారు. విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనివాస మూర్తి స్పందించి శుక్రవారం కాలిపోయిన నియంత్రిక స్థానంలో మరోటి ఏర్పాటు చేయించారు. సాయంత్రం 5.30 గంటలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

ఆశావహులు ముందుకురండి
డీసీసీ అధ్యక్షుడు ఎంహెచ్ ఇనయతుల్లా

హిందూపురం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని పటిష్ఠం చేయడంలో భాగంగా సత్యసాయి జిల్లాలో నియోజకవర్గం, మండలాల ఇన్‌ఛార్జులుగా పదవులు ఆశించే ఆశావహులు సంప్రదించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎంహెచ్ ఇనయతుల్లా తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వందేళ్లకు పైగా దేశ ప్రజలకు సేవలు అందించిందని, వివిధ మతాలు, ప్రాంతాలను సమన్వయం చేసుకొని భిన్నత్వంలో ఏకత్వం ధ్యేయంగా దేశంలో పనిచేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. నేడు జిల్లా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు.

భక్తి శ్రద్ధలతో హోమం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని జలదుర్గమ్మ, కన్యకాపరమేశ్వరి, మహాలక్ష్మి తదితర ఆలయాల్లో దసరా పండగను పురస్కరించుకుని తొమ్మిదో రోజు శుక్రవారం వేదపండితులు చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. కొల్హాపురమహాలక్ష్మి ఆలయంలో అతి పెద్దహోమ గుండం ఏర్పాటు చేసి 101 సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి సమర్పించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఉరుకులు పరుగులతో జయమంగళి సోయగం

పరిగి, న్యూస్‌టుడే: కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు జయమంగళి నది ఉరుకులు పరుగులతో ఆంధ్ర ప్రాంతంలోకి ప్రవహిస్తోంది. కర్ణాటక రాష్ట్రం కొరటగెర, మధుగిరి ప్రాంతాల్లో రెండురోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జయంగళి నదికి వరదలు వచ్చాయి. ఆయాప్రాంతాల్లో ఉన్న చెరువులు నిండి మరవలు పారుతున్నాయి. జయమంగళి నుంచి వస్తున్న వరద నీరు పరిగి చెరువుకు చేరుతోంది. మండల పరిధిలోని శ్రీరంగరాజుపల్లి పొలిమేర నదికి అడ్డంగా నిర్మించిన పాయకట్ట నుంచి రెండున్నర అడుగుల మేర వరద నీరు పరిగి చెరువులోకి చేరుతోంది. 2021-22 తరువాత ఈ యేడాది జయంగళి నది నుంచి వరద నీరు పరిగి చెరువులోకి ప్రవహిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పాయకట్ట వద్ద నుంచి పరిగి చెరువుకు ప్రవహిస్తున్న జయమంగళి వరదనీరు

కూచిపూడి నృత్యం భళా

హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న సప్తఫణిమాతృకా దేవి ఆలయంలో శుక్రవారం రాత్రి సేవామందిరం బృంగి నృత్యాలయం శిక్షకురాలు సుప్రియ ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శన చేశారు. -న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్


నృత్యం చేస్తున్న చిన్నారులు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

పెనుకొండ: గుట్టూరు గ్రామం నుంచి హరిపురం వరకు జాతీయ రహదారి పక్కన టీ కొట్లు, హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాల ముందు సీసీ కెమెరాలు, రాత్రులు లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై రాజేశ్ దుకాణదారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం పెనుకొండ మండలం అమ్మవారిపల్లిలోని కియా ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలోని దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డుపై అడ్డంగా వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని, దుకాణాల్లో మద్యం విక్రయించకూడదని హెచ్చరించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా మా క్లయింటు Pathan Sardar Vali, S/o P.Khadhar Basha మరియు ఇతని భార్య P.Sanma Husna వీరి ప్రస్తుత నివాసం డి.నెం. 20-7-15/1, నింకంపల్లి గ్రామము, హిందూపురం, శ్రీసత్యసాయి జిల్లా వాసులు క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా ఆస్థిని సి.ఎం. ఉమ్మె సల్మా, W/o సి.ఎం. మహమ్మద్ ముస్తఫా, హిందూపురం అనువారి నుండి Doc. No. 7548/2022 గా SRO హిందూపురంలో రిజిస్టరు కాబడిన పత్రం ద్వారా కొనుగోలు చేసినారు. సదరి ఆస్థికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు నం. 2226/2007 SRO హిందూపురం రిజిస్టరు అయి రఫివుల్లా ఖాన్ పేరుమీద కల పత్రాన్ని పోగొట్టుకున్నారు అని తెలిపినారు. సదరి విషయమై హిందూపురం రూరల్ పోలీసుస్టేషను అధికారి గారికి ఫిర్యాదు చేసినారు. సదరి పోలీసు అధికారి గారు ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 2226/07 గుర్తించబడలేదు అని ధృవీకరించినారు. కనుక ఎవర్కైననూ ఒరిజినల్ దస్తావేజు నెం. 2226/2007 గుర్తించిన యెడల క్రింద తెలిపిన న్యాయవాదికి తెలుపగలరు మరియు షెడ్యూలు దాఖలా ఆస్థిపై ఎవర్కైన ఎటువంటి ఆక్షేపణలుగాని, ఎటువంటి తాకట్టుగాని, బ్యాంకు ఋణములుగాని, కోర్టు వ్యవహారములు గానీ ఉన్నయెడల క్రింద కనబరచిన చిరునామాలో 10 రోజుల లోపు తెలియజేయవలెను.

షెడ్యూలు

శ్రీసత్యసాయి జిల్లా మరియు R.D. మరియు హిందూపురం సబ్.రి.డి.కి చెంది హిందూపురం గ్రామ పొలం, హిందూపురం మున్సిపల్ ఏరియాలో గల ఆస్థి వివరము.

బాబు	పార్టు	స.నెం.	య.సెం.	
స.తరి	I	241-2	0.63	ఈపైకి ప్లాటు నెం. 50
స.తరి	I	241-5	0.47	

ఇందుకు కొలతలు: తూర్పు - పడమర: 30 అడుగులు, **ఉత్తరం - దక్షిణం:** 40 అడుగులు, అనగా 133.33 చ॥గ॥. **చెక్కుబంది: తూర్పు:** ప్లాటు నెం. 49, **పడమర:** ప్లాటు నెం. 51, **ఉత్తరం:** 20 అ॥ రోడ్డు, **దక్షిణం:** సర్వే నెం. 243లోని జమీను.

ఇట్లు: పి.వి.శ్రీనివాస్‌రెడ్డి, అడ్వకేట్,
డి.నెం. 26-4-1361/1, భవానిశంకర్‌నగర్, మేళాపురం,
హిందూపురం. ఫోన్: 9440746213

తహసీల్దార్ లేక ఇబ్బందులు

గుడిబండ : గుడిబండకు తహసీల్దార్ లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ కరుణాకర్‌ను మడకశిరకు బదిలీ చేయగా గుడిబండకు ఎవరినీ నియమించలేదు. దీంతోరైతులు వన్‌బీ, అడంగల్, వెబ్‌ల్యాండ్, ఓనర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థులకు కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు గత్యంతరం లేక అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ తహసీల్దార్‌నైనా నియమించాలి.. లేదంటే ఆర్‌ఎస్‌డీటీ, సీఎస్‌డీలకైనా పూర్తి అదనపు బాధ్యతలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

దుస్తుల అందజేత

లేపాక్షి : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ ఆలయంలో పనిచేసే సిబ్బంది, ఇతర రంగాల్లో పనిచేసే 200 మంది సిబ్బందికి నూతన దుస్తులు అందించారు. మిఠాయిలు పంచి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

హైకోర్టు బార్ వైస్‌ప్రెసిడెంట్‌కి సత్కారం

పెనుకొండ : స్థానిక కోర్టులో శుక్రవారం రొద్దంకు చెందిన హైకోర్టు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.రంగారెడ్డిని పెనుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు ఆత్మీయ సమావేశం నిర్వహించి సత్కరించారు. క్యార్యక్రమంలో పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి • రాప్తాడు

ధర్మవరంలో పండుగ సందడి


ఎన్టీఆర్ కూడలిలో రద్దీ

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలో శుక్రవారం దసరా పండుగ కొనుగోలుదారులతో మెయిన్ బజార్ రద్దీగా మారింది. ఎన్టీఆర్ కూడలి నుంచి అంజుమన్ కూడలి వరకు జనంతో నిండిపోయింది. పండుగ సరకులు, దుస్తులు, పూజ సామగ్రి కొనుగోలు చేసేందుకు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు రావడంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఘనంగా ఆయుధపూజ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. దుర్గామాత, ఆయుధాలు, వాహనాలకు ఎస్పీ రత్న పూజలు నిర్వహించారు. దుర్గమ్మ ఆశీస్సులతో జిల్లా ప్రజలు, పోలీసులు ఆరోగ్యంతో సంతోషంగా జీవించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్ దంపతులు, ఏఆర్ డీఎస్పీ జెడ్ విజయ్‌కుమార్, ఎస్పీ సీసీ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, సీఐ సునీత, ఎస్సై ప్రదీప్‌కుమార్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రత్న, పోలీసు అధికారులు

మోస్తరు వాన.. రోడ్లు జలమయం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరిలో శుక్రవారం కురిసిన మోస్తరు వర్షానికి రోడ్లన్నీ మడుగులుగా మారాయి. వర్షపునీటికి మురుగు నీరు తోడవడంతో కాలేజీరోడ్డు, కుల్లాయప్పవీధి, వలిసాబ్‌రోడ్డు, నల్లగుట్టవీధి ప్రాంతాలు పిల్ల కాలువలను తలపించాయి. దాదాపు గంట పాటు రోడ్లు, వీధుల్లో నడవడానికి సాధ్యం కాలేదు. మురుగు కాలువలు అధ్వానంగా మారడంతో సాధారణ వర్షానికి సైతం రోడ్లు మడుగులమారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని స్థానికులు వాపోతున్నారు.

తలుపుల మీదుగా రాయచోటికి బస్సు

కదిరి, న్యూస్‌టుడే: కదిరి ఆర్టీసీ డిపో నుంచి రాయచోటికి బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు సహాయ మేనేజరు హరిత తెలిపారు. ఈ బస్సు ఉదయం 7గంటలకు బయలుదేరుతుంది. తలుపుల, లక్కిరెడ్డిపల్లి మీదుగా రాయచోటికి 10.30గంటలకు చేరుకుంటుంది. అక్కడ బయల్దేరి 12.30కు కదిరికి వస్తుంది. మధ్యాహ్నం 1.45 తిరిగి రాయచోటికి బయల్దేరుతుందని ఆమె పేర్కొన్నారు.

బోరు తవ్వకం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ బాలప్పగారిపల్లి కాలనీలో కొన్ని రోజులుగా ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. స్థానిక నాయకులు సమస్యను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి శుక్రవారం నూతన బోరు బావి తవ్వించారు. ఎంపీడీవో పోలప్ప, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, తెదేపా నాయకులు ఈశ్వరయ్య, సుధాకర్, బాబు, చలపతి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి పాలిటెక్నికల్ కళాశాల ఎదుట నూతనంగా పార్కు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు శుక్రవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. శుక్రవారం ఎంపీడీవో పోలప్ప స్థానిక కూటమి నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, కూటమి నాయకులు ఈశ్వరయ్య, రమణ, చలపతినాయుడు, బాబు, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఉచిత యోగా తరగతులు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో జనతా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఆరుణ్ ప్రశాంత్ తెలిపారు. పెనుకొండ రోడ్డులోని భజన మందిరంలో ఈ నెల 13 నుంచి నవంబరు 10 వరకు ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి 7.30 వరకు యోగా తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు సొసైటీ ప్రతినిధి గణేశ్ 94901 08511 నంబరు వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పని భారం తగ్గించాలని నిరసన

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం ఆర్టీసీ డిపోలో పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం 6వ రోజు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఏ డిపోలో లేనివిధంగా ధర్మవరం డిపోలో పని భారం పెంచారని, ఉద్యోగులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అన్నారు. ఆరు రోజులుగా నిరసన తెలుపుతున్నా డీఎం పట్టించుకోవడం లేదని, ఈ నెల 14 నుంచి ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి ముస్తఫా, మల్లికార్జున, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌ను కలిసిన పురపాలక కమిషనర్

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పురపాలక కమిషనర్ ప్రమోదకుమార్ శుక్రవారం రామగిరి మండలం వెంకటాపురంలో ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మవరం పట్టణ అభివృద్ధికి, వార్డుల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను పరిటాల శ్రీరామ్ కోరారు.

యుద్ధ కళ.. బాలికలు భళా

కదిరి, కొత్తచెరువు, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలో నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలు, బాలికలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి సమయంల్లో తమను తాము రక్షించుకునేలా బాలికలు యుద్ధ కళల్లో సాధన చేస్తున్నారు. మెలకువలు నేర్చుకొని ప్రత్యర్థులపై దాడితో చిత్తు చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు, ప్రశంసలు అందుకుంటున్న బాలికల గురించి కథనం.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం



కొత్తచెరువు మండలం మైలేపల్లికి చెందిన శ్రీనివాసులు, రమణమ్మ దంపతుల కుమార్తె గీతా వాణి. చదువుతో పాటు కరాటేలో రాణిస్తోంది. ప్రస్తుతం కర్నూలులో బీపీఈడీ చదువుతోంది. కరాటేలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పదుల సంఖ్యలో పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి పతకాలు, ప్రశంసలు అందుకుంది. సెలవుల్లో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు తాను పొందిన కరాటే మెలకువలపై శిక్షణ ఇస్తోంది. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తల్లిదండ్రులను బాధ్యతగా తీసుకోవటమే ఆశయమని చెబుతోంది.

పోలీసు అధికారిణి కావాలని..



చిగిచెర్లకు చెందిన యశస్విని తొమ్మిదో తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచే యుద్ధకళలపై మక్కువతో ఎంచుకున్న జూడో క్రీడలో రాణిస్తోంది. భవిష్యత్తులో సివిల్స్ రాసి ఐపీఎస్ అధికారి కావాలన్న లక్ష్యంగా నిర్ణయించుకుంది. జూడోలో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతోంది. సౌత్‌జోన్ నేషనల్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం అందుకుంది. 52 కిలోల బరువు విభాగంలో 2022, 2024లోనూ సబ్‌జూనియర్ నేషనల్ పోటీల్లో రెండుసార్లు, అండర్-17 కేటగిరీలో 2024లో సత్తాచాటింది.

మహిళలకు రక్షణగా నిలవాలని..


జాతీయ స్థాయిలో గెలుపే లక్ష్యంగా సాధన చేస్తున్న సిరి

కదిరి పట్టణానికి చెందిన పృథ్వీకుమార్‌రెడ్డి, మాధవిల కుమార్తె సిరి. బ్లూమూన్ పాఠశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతోంది. సమాజంలో జరుగుతున్న ఘటనలతో తనను తాను రక్షించుకోవడంతోపాటు ఐపీఎస్ సాధించి తోటి మహిళలకు రక్షణగా నిలవాలని నిర్ణయించుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మూడో తరగతి నుంచే కరాటే, బాక్సింగ్, ఫెన్సింగ్, ఓవిసం వంటి యుద్ధకళల్లో సాధన చేస్తోంది. జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి పతకాలు సాధించింది. 2022లో జబల్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. ఫెన్సింగ్‌లోనూ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించింది. ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీలకు సాధన చేస్తోంది.

జాతీయస్థాయిలో సత్తా చాటాలని..



కదిరిలో నివాసమున్న నిఖితబాయి బ్లూమూన్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతోంది. తండ్రి చంద్రశేఖర్ మృతిచెందటంతో అమ్మ జ్యోతిబాయి బ్యూటీపార్లర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నిఖితబాయి ఆరో తరగతి చదువుతున్నప్పుడే యుద్ధకళలను ఎంచుకుంది. కరాటే, బాక్సింగ్, ఫెన్సింగ్, జూడోలో ప్రత్యేక శిక్షణ పొందుతోంది. జిల్లాస్థాయిలో ఏడు, రాష్ట్రస్థాయి పోటీల్లో మూడుసార్లు విజేతగా నిలిచింది. జూడోలో ఖేలోఇండియా ఉమెన్ లీగ్ రాష్ట్ర పోటీల్లో ద్వితీయ స్థానాన్ని పొందింది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ విజయం సాధిస్తానన్న ధీమా వ్యక్తం చేస్తుంది.

భక్తిశ్రద్ధలతో కొల్లాపురమ్మ మండల పూజ

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గ్రామదేవత కొల్లాపురమ్మ మండల పూజా కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని స్థానిక ప్రతినిధులు భక్తులు, ప్రజల ద్వారా విరాళాలు సేకరించి నూతన ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. ఆగస్టు 30న ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. 41 రోజుల అనంతరం మండల పూజా కార్యక్రమాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.


చెన్నేకొత్తపల్లి: అలంకరణలో అమ్మవారి మూలవిరాట్టు

'ఉత్తర్వు 101 పునరుద్ధరించాలి'

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తర్వు 101ని పునరుద్ధరించాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పుట్టపర్తి మండల వనరుల కేంద్రంలో ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారితో ఆ సంఘం అధ్యక్షుడు ప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఇక్కడ కూడా అమలు చేయాలన్నారు. ఉత్తర్వు 101 పునరుద్ధరణ, అవార్డు గ్రహీతలకు రాయితీపై బస్సు, రైల్వే పాస్‌లు, ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం అనంతపురం జిల్లా ప్రతినిధి నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, అబ్దుల్ రహమాన్, జగదీశ్, శంకరనారాయణ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



సమస్య: సీఎన్ కోటకు వెళ్లే రహదారి వెంబడి వర్షం నీరు నిలిచి ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. **- బాలరాజు, స్థానికుడు.**

సమాధానం: వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా పక్కకు వెళ్లేలా ఏర్పాటు చేస్తాం **- మురళి, నీటిపారుదలశాఖ ఏఈ.**

సమస్య: కుర్లపల్లి తండాకు వెళ్లే రహదారి అధ్వానంగా మారి..రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. **- నారాయణ నాయక్, స్థానికుడు**

సమాధానం: రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. **- అశోక్, పంచాయతీ కార్యదర్శి.**

కనగానపల్లి, న్యూస్‌టుడే:

పండగ పూట నీటి కష్టాలు



సీకేపల్లి మండలం ముష్ఠికోవెలలో నెల రోజుల నుంచి నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా అందే నీటితో పండగవేళ నివాసాలను శుభ్రం చేసుకునేందుకు అగచాట్లు పడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ బోరు నుంచి ఎత్తులో ఉన్న కాలనీకి నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. బోరుకు సమీపాన ఉన్న వారు మోటార్లతో నీటిని తోడేస్తుండటంతో పైప్రాంతానికి సరఫరా కావడం లేదని చౌడమ్మ ప్రాంత ప్రజలు ఆరోపించారు. గ్రామంలోని ఓ వ్యక్తి కుటుంబ అవసరార్థం ట్యాంకు తెప్పించగా నీటిని పట్టుకునేందుకు పలువురు ఎగబడ్డారు. సమస్యను ఈఓఆర్డీ అశోక్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ముష్ఠికోవెల (చెన్నేకొత్తపల్లి)


ముదిగుబ్బ: శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకరణలో వాసవిమాత


కళ్యాణదేవి అలంకరణలో చౌడేశ్వరీదేవి(లక్ష్మినగర్)


మహిషాసురమర్దినిగా దాడితోట పెద్దమ్మతల్లి


తలుపులలో దుర్గాదేవిగా వాసవీమాత


ధర్మవరం కేపీటీ వీధిలో కాళికాదేవిగా పెద్దమ్మ


ధర్మవరంలో మహిషాసురమర్దినిగా దుర్గమ్మ


కదిరి: నాగిరెడ్డిపల్లిలో చౌడేశ్వరీదేవి

మహిషాసురమర్దిని.. త్రిశూల ధారిణి

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు


పుట్టపర్తి గ్రామీణం: నవదుర్గల అవతారంలో మహిళలు

పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు చాముండేశ్వరిగా, నవదుర్గగా, విజయదుర్గగా, దుర్గాదేవిగా, మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిదో రోజు దుర్గాష్టమిని పురస్కరించుకుని త్రిశూలాన్ని ధరించి దుర్గతుల నుంచి కాపాడే దేవతగా అమ్మవారిని కొలిచారు. ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువైన అమ్మవారిని భక్తులు మనసారా దర్శించుకుని కీర్తించారు. హోమాలు, కుంకుమ అర్చనలు, అభిషేకాలతో ఆలయాలు శోభిల్లాయి.


- న్యూస్‌టుడే బృందం


కదిరి: శ్రీఖాద్రీనృసింహుడు


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి


చెన్నేకొత్తపల్లి: న్యామద్దలలో మహిషాసురమర్దినిగా


పుట్టపర్తి పట్టణం: దుర్గామాత అలంకరణలో


బత్తలపల్లిలో దుర్గాదేవి


కొత్తచెరువులో వాసవీ కన్యకాపరమేశ్వరి


కదిరి పట్టణం: మరకత మహాలక్ష్మి


నల్లచెరువులో చాముండేశ్వరిగా..

రహస్యంగా ఎంఎస్ కమిటీ ఎంపిక

• మహిళా సంఘాల్లో స్వాహాకు తెరవెనుక రాజకీయం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో రెండు రోజుల కిందట మండల సమాఖ్య కమిటీని రహస్యంగా ఎంపిక చేయడంలో అంతర్యమేమిటన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మొదట గ్రామ సంఘాల్లో (విఓ) నూతన కమిటీలను ఎన్నుకుంటారు. తరువాత మండలంలోని అన్ని వివోలకు సమాచారం అందించి నిబంధనల మేరకు వార్షిక మహాసభ నిర్వహించాలి. ప్రతి వివో నుంచి ఇద్దరు, ముగ్గురు లీడర్లు మహాసభకు హాజరై మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి, ఉప కార్యదర్శులను ఏపీఎం ఆధ్వర్యంలో ఎన్నుకుంటారు. వీరే వందలాది మహిళా సంఘాల కోట్ల ఆర్థిక లావాదేవీల్లో కీలకం కానున్నారు.

ఏకపక్షంగా కమిటీ ఎన్నికపై విమర్శలు

ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏపీఎం నారాయణ మండలంలోని విఓలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా కమిటీని ఎన్నుకోవడంపై మహిళా సంఘాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైకాపా పాలనలో కొందరు యానిమేటర్లు, సీసీలు కుమ్మక్కై సంఘాల్లోని పొదుపు మొత్తాలను పెద్దఎత్తున స్వాహా చేశారు. నేటికీ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ నమోదుకు లక్షల్లో తేడాలుండటం.. కష్టపడి పొదుపు చేసుకున్న మహిళలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కొన్ని వివోల్లో యానిమేటర్లు, సీసీలు గారడి చేసిన రూ.40 లక్షలు నేటికీ మొండి బకాయిలుగా పేరుకున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు అక్రమార్కులు ముఠాగా ఏర్పడి గతంలోని స్వాహా పర్వాలు వెలుగులోకి రాకుండా తెర వెనుక రాజకీయంతో డ్వాక్రా సంఘాల లావాదేవీల్లో కనీస అవగాహన లేనివారిని అందలం ఎక్కించారు. సంఘాల ఆర్థిక లావాదేవీల్లో ఎదురులేకుండా వారి చెప్పుచేతుల్లో ఉండే వారికి మండల సమాఖ్యలో చోటు కల్పించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులకు ప్రారంభంలోనే అడ్డుకట్ట వేసి డ్వాక్రాలో పొదుపు మొత్తాలకు భద్రత కల్పించాలని పేద, మధ్య తరగతి మహిళలు వేడుకుంటున్నారు. కమిటీ రహస్య ఎన్నికపై సమాచారం కోసం ప్రయత్నించినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం లోగుట్టుకు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే కమిటీ ఎంపికపై ప్రశ్నించిన వారికి ఎన్నుకోలేదని ఒకసారి, ఎన్నుకున్నామని ఒకసారి చెబుతూ గందరగోళాన్ని సృష్టించడం గమనార్హం. ఈవిషయాన్ని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య దృష్టికి తీసుకెళ్లగా గతంలో పని చేసిన ఏపీఎం ఎంఎస్ ఎన్నికలో జాప్యం చేశారన్నారు. వివోలకు సమాచారం అందించి నిబంధనల మేరకు పారదర్శకంగా మండల సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకోవాల్సి ఉంది. కొత్తచెరువు ఎంఎస్ ఎంపికపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుడ్డులో అత్యధిక పోషకాలు

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుడ్డులో అత్యధిక పోషకాలు ఉంటాయని ఎగ్ బ్యాంక్ వ్యవస్థాపకులు హరికిషన్‌వాల్మీకి అన్నారు. గురువారం పుట్టపర్తిలో ఎగ్-డేను పురస్కరించుకుని గుడ్డు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 120 ఎగ్ బ్యాంకులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక గుడ్డులో 75 కెలరీలు, 7 గ్రాముల ప్రొటీన్‌తోపాటు ఐరన్, విటమిన్స్, ఖనిజాలు ఉంటాయన్నారు. అనాథలు, వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో గుడ్లను ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.


గుడ్లను చూపుతున్న హరికిషన్‌వాల్మీకి తదితరులు

వేరుసెనగ కట్టె దగ్ధం

బత్తలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని జ్వాలాపురం గ్రామంలో విద్యుత్తు తీగలు తగిలి వేరుసెనగ కట్టె దగ్ధమైంది. రైతు రమేశ్ తన పొలంలోని వేరుసెనగ కట్టెను ట్రాక్టరులో గ్రామంలోకి తీసుకొస్తుండగా 11కేవీ విద్యుత్తు తీగలు తగిలి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో వేరుసెనగ కట్టెతోపాటు ట్రాక్టరు ఇంజిన్ టైర్లు పగిలిపోయి కాలిపోయాయి. సుమారు రూ.90 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు. ఏఈ శివయ్య స్తంభం ఏర్పాటు చేసి తీగలను ఎత్తులో ఏర్పాటు చేయించారు.

అన్నపై తమ్ముడి దాడి

ధర్మవరం, న్యూస్‌టుడే: మల్లాకాల్వ గ్రామంలో గురువారం రాత్రి గంగాధర్‌పై అతడి సోదరుడు మహేశ్ రోకలి బండతో దాడి చేశాడు. తలకు బలమైన గాయం కావడంతో అతణ్ని కుటుంబ సభ్యులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటి పత్రాల విషయంలో అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో గంగాధర్‌పై అతడి సోదరుడు మహేష్ దాడి చేశాడని ధర్మవరం గ్రామీణ పోలీసులు తెలిపారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

• నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం

ముదిగుబ్బ, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ పాలనలో రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రజలు నరకం అనుభవించారు. ఎటు చూసినా గుంతలు, గతుకులు, మట్టి రోడ్లతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. పంచాయతీరాజ్ విభాగం అధికారులు అధ్వానంగా మారిన రోడ్లను గుర్తించి ప్రతిపాదించడంతో ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం 25 కిలోమీటర్ల మేర రహదారులకు మోక్షం లభించింది. అయితే అధికారులు ప్రతిపాదించిన రోడ్లలో కొన్నింటికి మాత్రమే నిధులు మంజూరయ్యాయి. మిగిలిన వాటికి నిధులు రావాల్సి ఉంది.

రూ.12 కోట్లతో ప్రతిపాదనలు

మండల కేంద్రాలు, పల్లెల్లో ఎక్కడెక్కడ రహదారుల అవసరముందో గుర్తించి మొత్తం రూ.12 కోట్ల అంచనా వ్యయంతో పంచాయతీరాజ్ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో మండలానికి రూ.3కోట్ల చొప్పున నిధులు మంజూరు చేసింది. ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం రూ.6కోట్లు మంజూరు కావడంతో దశలవారీగా సీసీ రోడ్లు నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొదటి విడతలో బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాలు, రెండో విడతలో ధర్మవరం గ్రామీణం, తాడిమర్రి మండలాల్లో రోడ్లు నిర్మించనున్నారు.

గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం

ముదిగుబ్బలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో కాలనీ నిర్మించి ఎనిమిదేళ్లు గడుస్తోంది. కనీస మౌలిక వసతులు కల్పించక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్లలో కాలనీ పర్యటనకు వచ్చినప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారులకు గ్రామీణులు అనేకసార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం శూన్యం. అధికారులు ప్రతిపాదించినప్పటికీ అప్పట్లో ఒక్క రూపాయి నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా కస్తూర్బా కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


ముదిగుబ్బలోని టవర్ సమీపంలో నివాసల మధ్య మట్టిరోడ్డు

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం - శ్రీరాములు, పీఆర్ డీఈ, ధర్మవరం

నియోజకవర్గంలో రూ.6 కోట్ల నిధులు మంజూరు కావడంతో రోడ్ల నిర్మాణానికి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. మొదట బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాలకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే ధర్మవరం, తాడిమర్రి మండలాలకు మంజూరు కానున్నాయి.

ఆగిన లారీని ఢీకొన్న 108 వాహనం

✦ ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లి మండలం తంభాపురం సమీపంలోని జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని 108 వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం అర్ధరాత్రి బత్తలపల్లి వైపు నుంచి కదిరివైపు పత్తిలోడుతో వెళ్తున్న లారీ తంభాపురం సమీపంలో టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్ రోడ్డు పక్కన ఆపేశారు. ఈ క్రమంలో ముదిగుబ్బకు చెందిన 108 వాహనం బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో బాధితులను వదిలి, తిరిగి వస్తూ లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొంది. డ్రైవర్ బాలఓబిలేసు, రవికుమార్ గాయపడ్డారు. స్థానికులు వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మండలం అలీపూర్‌తండా సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ముత్యాలచెరువువాసి రామచంద్రారెడ్డి గాయపడ్డారు. బాధితుడిని అదే బస్సులో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: అమడుగూరు మండలం మహమ్మదాబాద్ సమీపంలోని మామిడి తోటలో ఒంటరిగా ఉన్న రామలక్ష్మిని హత్య చేసిన కేసులో నిందితుడు ఆంజనేయులును అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పుట్టపర్తి, కదిరి డీఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణ, ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డితో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హత్య కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడించారు. మహమ్మదాబాద్ వద్ద ఏఎస్ఐ కృష్ణమూర్తికి చెందిన మామిడి తోటలో పెనుకొండకు చెందిన రామలక్ష్మి ఇటీవల తోటమాలిగా చేరింది. ఆమె కారణంగానే తనను పని నుంచి తొలగించారని గతంలో తోటమాలిగా పనిచేసిన ఆంజనేయులు కక్ష పెంచుకున్నాడు. వారిద్దరికీ గతంలోనే పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 6న ఆమె, ఆంజనేయులుకు ఫోన్ చేసి మద్యం తీసుకురావాలని కోరింది. ఇదే అవకాశంగా భావించిన అతడు రాత్రి 8గంటలకు మద్యం తీసుకుని మామిడి తోటకు వచ్చాడు. మద్యం తాగాక రామలక్ష్మిపై పారతో విచక్షణా రహితంగా కొట్టి హత్య చేశాడు. మృతురాలి కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఓడీసీ మండలం వేమారెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ సునీత, ఎస్ఐ వెంకటనారాయణ, ఎస్పీ సిబ్బంది, పోలీసులు సూర్యనారాయణ, రవి, జబీవుల్లాకు నగదు రివార్డులు అందించి, అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రత్న

అఖిలాండేశ్వరి... అభయప్రదాయిని

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పలు ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహిస్తున్నారు. రోజుకో రూపంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి.. కొలువు దీరుస్తున్నారు. ఆలయాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని తరిస్తున్నారు.

అనంతలో విశేషపూజలు



నవమి రోజు జగజ్జనని వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అనంతపురం నగరం కొత్తూరు అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల విశేష పూజలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

లేపాక్షిలో దసరా వేడుకలు



మహాచండీ అలంకరణలో దుర్గాదేవి


లేపాక్షి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో సుప్రభాతసేవ, సప్తశతి పారాయణం, అభిషేకాలు, అర్చనలు చేశారు. మహాచండీగా అమ్మవారు దర్శనమిచ్చారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, వసుంధర దంపతుల ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, తెదేపా మండల కన్వీనర్ జయప్ప, ఎంపీటీసీ సభ్యురాలు లలిత పర్యవేక్షించారు.

మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ

ధర్మవరం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రులు ధర్మవరంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని దుర్గమ్మ, పెద్దమ్మ, కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి అమ్మవార్లను పలు రూపాల్లో సుందరంగా అలంకరించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



దుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



దీపకాంతుల్లో పెద్దమ్మ తల్లి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : బుక్కరాయ సముద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో దేవీనవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఆయుధ పూజను పురస్కరించుకొని అర్చకులు అమ్మవారికి దీపాలంకరణ చేశారు. దివ్యరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

దుర్గంలో చండీహోమం

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను మహిషాసుర మర్దినిగా కొలువుదీర్చి... పూజలు చేశారు. నగరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం, దుర్గా సప్తశతి పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్య భక్తులు తరలివచ్చి హోమంలో పాల్గొన్నారు.

